PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR
# నవగీతం
NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 77 | పేజీలు : 8 | శుక్రవారం 14 ఆగస్టు 2026 | వెల : 4/-

PRGI.NO.TGTEL/26/A2002
నవగీతం
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
నవగీతం తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాలో నియోజకవర్గ ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
Cell: +919912484184
Email: navageetamnews@gamil.com
Website: www.navageetam.com

# బీసీ మహిళలకు ఫ్రీగా ఆటోమేటెడ్ కుట్టుమిషన్ల పంపిణీ

- ఈ నెల 15 నుంచి అప్లికేషన్ల స్వీకరణ
- బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పథకం ప్రారంభం
- బీసీ మహిళలకు నియోజకవర్గానికి వెయ్యి ఆటోమేటిక్ కుట్టుమిషన్లు
- సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం




హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద, నిరుద్యోగ బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గానికి 1000 మంది చొప్పున, వంద శాతం సబ్సిడీతో ఆటోమేటెడ్ కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు సచివాల యం వేదికగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై - మిగతా3లో



## ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

- అప్పటి వరకు వారిని నిద్రపోనివ్వం: రాహుల్ ఘాటు విమర్శలు
- అధికార పార్టీకి భిన్నంగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమన్న కాంగ్రెస్ అగ్రనేత
- ఆర్ఎస్ఎస్ నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని రాహుల్ వ్యాఖ్య
- ఆర్ఎస్ఎస్ బడా పెట్టుబడిదారుల చేతుల్లో సాధనంగా మారిపోయిందని విమర్శ

# ప్రజలపై చేతబడులా?

- అవి తిరగబడితే ఫామ్‌హౌస్‌ల్లో అష్టదిగ్బంధనమే
- ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పదేళ్లు అధికారంలో ఉన్నవారు ప్రభుత్వం, ప్రజలపై అఘోరా పూజలు చేయించడం దుర్మార్గం
- రాష్ట్రంలో కరువొచ్చి జనాలు అల్లాడిపోవాలని, ప్రభుత్వం బద్నాం కావాలని చేతబడులు చేశారు
- ఎంత ఘోరమైన పూజలు చేసినా దేవుడు, అదృష్టం మా వైపే..
- మా సంకల్పం మంచిది కాబట్టే ఎల్‌నినో సమయంలోనూ వర్షాలు




హైదరాబాద్

'పదేళ్లు అధికారంలో ఉన్న వారు, పాతికేళ్లు తెలంగాణలో రాజకీయం చేసినవారు ప్రభుత్వం, ప్రజలపై పొరుగు రాష్ట్రాలకు వెళ్లి చేతబడులు, అఘోరా పూజలు చేయించడం అత్యంత దుర్మార్గం. బుద్ధి సరిగ్గా లేకపోతే ఆ క్షుద్ర పూజలే తిరగబడతాయి. అదే గనుక జరిగితే మిమ్మల్ని ఫామ్‌హౌస్‌ల నుంచి బయటికి రాకుండా అష్ట దిగ్బంధనం చేస్తాయి..' అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. గురువారం కూకట్‌పల్లిలో తొలి ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం ఎండిపోవాలని, కరువు వచ్చి జనాలు అల్లాడిపోవాలని, ప్రభుత్వం బద్నాం కావాలని ప్రతిపక్ష నాయకులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అఘోరా పూజలు, చేతబడులు చేశారు. ఎంత ఘోరమైన పూజలు చేసినా దేవుడు, అదృష్టం మా వైపే ఉన్నాయి. మా సంకల్పం మంచిది కాబట్టే ఎల్ నినో సమయంలోనూ వర్షాలు కురిసి ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్‌లు నిండాయి. హైదరాబాద్‌కు తాగునీటి ఎద్దడి లేకుండా పోయింది. చిత్తశుద్ధి, మంచి ఆలోచన ఉన్న మా ప్రభుత్వాన్ని ప్రజల ఆశీస్సులు, దేవుడి దయ ఎల్లప్పుడూ కాపాడతాయి..' అని సీఎం అన్నారు. 'గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలను ఊరించి, నగరం నుంచి 40--50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొల్లూరు, మేడ్చల్ లాంటి ప్రాంతాల్లో కట్టి ఇబ్బందులకు గురిచేసింది. నగరంలో పనిచేసుకునే పేదలు అర్ధరాత్రి వేళ అంత దూరం వెళ్లి ఎలా జీవిస్తారు అందుకే - మిగతా3లో

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

- ప్రత్యేక కోర్టులతోనే అన్నీ పరిష్కారం!: జస్టిస్ సూర్యకాంత్
- ప్రతి కేసుకు ఒకే కాలపరిమితి సాధ్యం కాదన్న సీజేఐ
- ప్రత్యేక కోర్టులు, టైమ్ బౌండ్ ట్రయల్స్‌తో పెండింగ్ కేసుల పరిష్కారం జరుగుతుందన్న జస్టిస్ సూర్యకాంత్





## పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు

- నినాదాల మధ్య ఉభయసభలు నిరవధిక వాయిదా
- చివరి రోజూ కొనసాగిన అధికార, విపక్షాల నిరసనలు
- లోక్‌సభలో వందేమాతరం గీతం అనంతరం సైన్ డై ప్రకటించిన స్పీకర్
- రాహుల్‌ను బీజేపీ టార్గెట్- కోతి బొమ్మతో కాంగ్రెస్ నిరసన

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ

- బంజారాహిల్స్‌లోని మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదని విమర్శ
- హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడనని, రెండు కళ్లలా చూస్తానని స్పష్టం



హైదరాబాద్

కాంగ్రెస్ అంటే సెక్యులర్ పార్టీ అని హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చిందని తెలిపారు. బంజారాహిల్స్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మిట్‌లో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం సర్టిఫికెట్లు చూసి కాదని, నైపుణ్యాలు చూసి ఉద్యోగం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలకు రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించారని, మైనార్టీ రిజర్వేషన్ల రద్దుకు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారని రేవంత్ రెడ్డి తెలిపారు. మైనార్టీ రిజర్వేషన్లను రద్దు చేయడంలో మోదీ, అమిత్‌షా విఫలమయ్యారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ వస్తే మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా చెప్పారని, గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి - మిగతా3లో

# నకిలీలకు చెక్


## 9 సెక్యూరిటీ ఫీచర్లతో తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులు!

- ఆగస్టు 15 నుంచి తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- నకిలీలను అరికట్టేందుకు 9 రకాల భద్రతా ఫీచర్ల జోడింపు
- సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అధికారిక ప్రారంభం
- క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్, యూవీ లోగో వంటి అత్యాధునిక ఫీచర్లు
- ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని వెల్లడి




హైదరాబాద్

తెలంగాణలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం తొమ్మిది రకాల సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ కార్డుల పంపిణీని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సంగారెడ్డి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించి, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పౌరసరఫరాల శాఖ ఈ నూతన కార్డులను అందుబాటులోకి తీసుకువస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ కార్డులలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అధికారిక సంతకం, తెలంగాణ ప్రభుత్వ అధికారిక హోలోగ్రామ్‌తో పాటు, స్పర్శతో గుర్తించేలా "గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" - మిగతా3లో



## చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

- సరిహద్దు గ్రామాల్ని దేశపు తొలి గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జెమితాంగ్‌లో రోడ్లు, విద్యుత్, వైద్యం, పర్యటకంతో మారుతున్న పరిస్థితులు
- మౌలిక వసతులున్నా ఉపాధి లేక ఖాళీ!

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

- సీఈఓ పోస్టు కోసం 5,585 దరఖాస్తులు
- సీఈఓ ఎంపిక కోసం సెర్చ్ కమిటీ ఇంటర్వ్యూలు
- ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు
- పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం



నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026

# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు



జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు.

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ పార్టీ స్పందించడం లేదంటూ బీజేపీ నేతలు ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ మకర్ ద్వార్ వద్ద బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, సభా కార్యకలాపాలను అడ్డుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందని అధికార పక్షం విమర్శించింది. బీజేపీ నిరసనకు కొద్దిసేపటికే విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఓ బొమ్మ కోతిని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. '56 అంగుళాల చిన్న కోతి లోపలికి రా' అంటూ చేసిన నినాదాలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి. అధికార పక్ష నేతలు ఈ నిరసన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**'సభ నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'**

సభ సజావుగా సాగకపోవడానికి విపక్షాన్ని నిందించడం సరికాదని ప్రతిపక్షాలు ఎంపీలు అన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సౌగత రాయ్ అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన వినేందుకు విపక్షం సిద్ధంగా లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరామని, ఎవరి ఆదేశాలతో పెల్లెట్ గన్ కాల్పులు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన వివరణ రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా సభ వాషౌట్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. గత 20 రోజులుగా పార్లమెంట్‌లో ఉండి సమస్యలపై చర్చకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలు ముగియడానికి చివరి రోజు మాత్రమే కేంద్ర హోంమంత్రి చర్చకు సిద్ధమని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.

**విపక్షమే సభను అడ్డుకుందని బీజేపీ ఆరోపణ**

మరోవైపు అధికార పక్షం కూడా విపక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం సభ నడుస్తుందని, దానిని ఎవరి వ్యక్తిగత వ్యవహారంలా మార్చలేరని అన్నారు. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రభావంతో వరుసగా కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి రాజీనామా చేయాల్సి వస్తుందని భావించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు వ్యవస్థ ప్రకారమే జరుగుతాయని చెప్పారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో సభలు దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్ నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసనలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది. అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీజేపీపై గురువారం విరుచుకుపడ్డారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్?కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనలను ప్రభుత్వం అణచివేసిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ బాధను వ్యక్తం చేయాలని విద్యార్థులు అనుకుంటుంటే, ఆ ప్రభుత్వం మాత్రం నిబంధనల పేరుతో వారి గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని అధికార పక్షం కేవలం కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా దేశంపై ఒక కఠినమైన వ్యవస్థను బలవంతంగా రుద్దడమే వారి రాజకీయ తత్వమని దుయ్యబట్టారు. గురువారం దిల్లీలో జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సు'లో ఆయన మాట్లాడారు.

**అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం**

అయితే, అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న నిబంధనలను కాంగ్రెస్ పార్టీ బద్దలు కొడుతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల క్రితం ఉత్తరాఖండ్‌లో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఓ యువతి తల్లి తనను కలిసి కన్నీరు పెట్టుకుందని రాహుల్ గుర్తుచేసుకున్నారు. బాధితురాలు తన ఆవేదనను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంటే, ప్రస్తుత వ్యవస్థ మాత్రం ఆమెను మాట్లాడనివ్వడం లేదు మండిపడ్డారు. ఆమె మాట్లాడితే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని




అంటున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ దౌత్య విధానంపై రాహుల్? తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ నాయకులను కౌగిలించుకోవడం కాకుండా దేశ ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ పని అని హితవు పలికారు. కేవలం స్నేహం, బహిరంగ ఆత్మీయ ప్రదర్శనలపై ఆధారపడకుండా, అంతర్జాతీయ సంబంధాలకు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలిపారు.

"కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు కలిసి తమ గళాన్ని వినిపించడం ప్రారంభించాయి. ఇక దీన్ని ఎవరూ ఆపలేరు. నరేంద్ర మోదీ రాజీనామా చేసి, అమిత్ షా పదవి నుంచి తప్పుకునే వరకు మేం వదిలిపెట్టం. చివరికి వారు 'మమ్మల్ని క్షమించండి, మమ్మల్ని వదిలేయండి' అని అంగీకరించి చేతులెత్తేసే వరకు మేం వారిని నిద్రపోనివ్వం. అయితే, ఇదంతా ద్వేషం, హింస లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగానే ఎదుర్కొంటాం. దేశ విలువలు, సంస్కృతి కోసం మావంతు ఈ పోరాటం చేస్తున్నాం. మన దేశం, ఆప్యాయత, ప్రేమ, సోదరభావం, అహింస కలిగిన దేశం. ఈ విషయాన్ని మేం అందరికీ నిరూపిస్తాం."

**ఆర్‌ఎస్‌ఎస్‌పై రాహుల్ కీలక వ్యాఖ్యలు**

మరోవైప, రాష్ట్రీయ స్వయం సేవక్? సంఘ్?(ఆర్‌ఎస్‌ఎస్)పై కూడా రాహుల్? ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్?ఎస్?ఎస్? నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గతంలో మనం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడామని, కానీ ప్రస్తుతం మనం పోరాడుతున్నది మన దేశ చరిత్ర, సిద్ధాంతాలపై కనీస అవగాహన లేని కొందరు జోకర్లతో అని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అర్థం చేసుకోవాలంటే 3,000 ఏళ్ల నాటి విషయాలు కాదు, ప్రస్తుత భారతదేశాన్ని, ఇక్కడి ప్రజల భావాలను అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఒకప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ అంటే దేశంలోని చిన్న వ్యాపారులు, స్వర్ణకారులు, నగల వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించారని రాహుల్ పేర్కొన్నారు. కానీ ఆ కాలం నాటి ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడో కనుమరుగు అయిపోయిందని అన్నారు. ప్రస్తుత ఆర్‌ఎస్‌ఎస్ పూర్తిగా రూపాంతరం చెంది పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులు, బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని ఆరోపించారు. చేతుల్లో కర్రలు పట్టుకుని తిరుగుతూ వారు తమను తాము హాస్యాస్పదంగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు.

# 'చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

సరిహద్దు గ్రామాలు అంటే ఒకప్పుడు దేశ పటంలో చివరి అంచున ఉన్న ప్రాంతాలుగానే చూసేవారు. అక్కడికి రోడ్డు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు చేరడమే పెద్ద సవాలుగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దేశ సరిహద్దులోని గ్రామాల్ని చివరి గ్రామాలుగా కాకుండా, దేశపు తొలి గ్రామాలుగా చూడాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్ని చేపడుతోంది. కానీ సరిహద్దు గ్రామాలకు రోడ్లు, భవనాలు, విద్యుత్ అందిస్తేనే అక్కడి ప్రజలు ఆగిపోతారా? ఉపాధి లేకపోతే యువత తిరిగి నగరాలవైపు వెళ్లిపోరా? ఈ ప్రశ్నలకు అరుణాచల్ ప్రదేశ్‌లోని రెండు సరిహద్దు ప్రాంతాలు రెండు భిన్నమైన సమాధానాల్ని చూపిస్తున్నాయి. ఒకవైపు అభివృద్ధితో మారుతున్న తవాంగ్ జిల్లాలోని జెమితాంగ్; మరోవైపు మౌలిక వసతులు ఉన్నా ప్రజల వలసలతో వెలవెలబోతున్న లిమేకింగ్ తక్సింగ్.

చైనాతో అత్యంత సున్నితమైన సరిహద్దును పంచుకుంటున్న అరుణాచల్ ప్రదేశ్‌లో స్థానికుల వలసల్ని అడ్డుకోవడం, సరిహద్దు గ్రామాల్ని మౌలిక వసతులతో బలోపేతం చేయడం, వాటిని ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడం, లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (ఎవూ)' ను ప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా- అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల 'కిబిథూ' గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని లాంఛ్ చేశారు. 2026 ఫిబ్రవరి 20న అసోంలోని సరిహద్దు గ్రామం నుంచి రెండో విడతను కూడా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవం వేళ అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోని 'జెమితాంగ్', 'లిమేకింగ్- తక్సింగ్' గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో ఈటీవీ భారత్ అందిస్తున్న ప్రత్యేక కథనం. అరుణాచల్ ప్రదేశ్ దేశంలోనే అత్యంత కీలకమైన సరిహద్దు రాష్ట్రం. ఇది చైనాతో సుమారుగా 1080 నుంచి 1200 కిలోమీటర్ల మేర సరిహద్దును (మెక్ మోహన్ లైన్) పంచుకుంటోంది. చైనా ఎప్పటికప్పుడు అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తమవేనని, దానిని దక్షిణ టిబెట్ అని పిలుస్తూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది. అయితే భారత్ మాత్రం చైనా బెదిరింపుల్ని తిప్పికొడుతూ, అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలోని అంతర్భాగమేనని స్పష్టం చేస్తోంది. చైనా ఆక్రమణల్ని అడ్డుకోవాలంటే సైన్యంతో పాటు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు నివసించడం కూడా చాలా ముఖ్యం. అందుకే సరిహద్దు గ్రామాల్ని ఖాళీ కాకుండా చూడటం కూడా భద్రతా వ్యూహంలో భాగంగా మారింది.

**జెమితాంగ్ సక్సెస్ స్టోరీ**

పశ్చిమ అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లాలో ఉన్న జెమితాంగ్ గ్రామం చైనా సరిహద్దుకు చాలా దగ్గరగా ఉంటుంది. ఇక్కడ భారత్ చేపట్టిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వైబ్రెంట్ విలేజెస్ పథకం కింద ఇక్కడ అద్భుతమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఇక్కడ రవాణా వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఆర్మీ పోస్టులకు లేదా వేరే ఊళ్లకు వెళ్లాలంటే గంటల తరబడి కొండల్లో నడవాల్సి వచ్చేది. ఇంకా ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన వంతెనలు దాటాల్సి ఉండేది. కానీ ఇప్పుడు చూస్తే వాహనాలు నేరుగా చివరి ప్రాంతం వరకు వెళు_న్నాయి. రోడ్లు, విద్యుత్, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రోజువారీ జీవితం కూడా సులభమైంది. ఇక్కడ భారత సైన్యం కేవలం సరిహద్దు కాపలాకే పరిమితం కాలేదు. ఆపరేషన్ సద్భావ్ కింద ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, తాగునీటి సదుపాయాలు కూడా కల్పిస్తోంది. ఐటీబీపీ బలగాలు ప్రజలతో పాటు వారి పశువులకు కూడా వైద్యం అందిస్తున్నాయి. ప్రసిద్ధ గొర్సమ్ చోర్టెన్ స్థూపం, జెమితాంగ్ లోయ అందాలు పర్యటకుల్ని ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మహిళలు 'కొమోస్ కేఫ్' పేరుతో కేఫ్ నిర్వహిస్తూ తమకంటూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఈసారి ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేసి మోమోస్, నూడుల్స్, చోమిన్, రాగులతో చేసిన పదార్థాల్ని కూడా అమ్మడానికి సిద్ధమవుతున్నారు. ఏటా జరిగే గొర్సమ్ ఉత్సవం సైన్యానికి, స్థానిక ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింత పెంచుతోంది.

**మేకింగ్- తక్సింగ్‌లో మరో పరిస్థితి!**

జెమితాంగ్‌లో అభివృద్ధి కనిపిస్తుంటే తూర్పున ఉన్న అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లిమేకింగ్ – తక్సింగ్ ప్రాంతం మాత్రం మరో వాస్తవాన్ని చూపిస్తోంది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవం సందడి కాస్త తగ్గింది. ఒకప్పుడు ఆగస్ట్ 15 వస్తే ఇక్కడ పండగ వాతావరణం ఉండేది. బ్యాండ్ మేళాలు, ఆటల పోటీలు, పరేడ్‌లు కూడా జరిగేవి. సైనికులు, అధికారులు, ఊరి జనమంతా ఉత్సాహంగా పాల్గొనేవారు. కానీ ఇప్పుడు అక్కడ జనం పెద్దగా లేక ఉత్సాహం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో ఇంకా 3 మిడిల్ స్కూళ్లు, 11 ప్రైమరీ స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్లు, బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించే ప్రజల సంఖ్య తగ్గిపోతోంది. చదువు, ఉద్యోగాల కోసం యువత గ్రామాల్ని వదిలి వెళ్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోసం పూర్తిస్థాయి ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, అందులో మొదటిగా 16 మందిని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇప్పుడు ఆ పదహారు మంది నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి, సెర్చ్ కమిటీ తమకు పంపుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. "షార్ట్ లిస్ట్ చేసిన పదహారు మంది అభ్యర్థుల పనితీరును సమీక్షించి, సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆ అభ్యర్థుల జాబితాను తగిన సమయంలో ట్రస్టుకు తెలియజేస్తుంది. దీనిపై ట్రస్ట్ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది" అని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది.

**ఇంటర్వ్యూలు**

రిటైర్డ్ జస్టిస్ పర్మోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వీకే చతుర్వేది, అణుశాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ హవ్రేలతో కూడిన సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణంలో ఆగస్టు 11, 12 తేదీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సెర్చ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, సీఈఓ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,877 మంది అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన కవర్ లెటర్స్ (సీవీ) సమర్పించారు. నమొదటి దశలో నిర్వహణ సామర్థ్యం, భారీ స్థాయి కార్యక్రమాలను, సిబ్బందిని నిర్వహించడంలో అనుభవం, వ్యక్తిగత నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, భవిష్యత్తు దృక్పథం, వ్యూహాత్మక ప్రణాళిక వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోశారు. రెండో దశలో అభ్యర్థులు సమర్పించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సుమారు 111 మంది అభ్యర్థులను ఆన్?లైన్?లో ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వారి కమ్యునికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను ఇందులో అంచనా వేశారు. మూడో దశలో ముఖాముఖి ఇంటర్వ్యూల కోసం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఫైనలిస్టుల్లో ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికులు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు, ప్రభుత్వ, ప్రభుత్వేర సంస్థల్లో పనిచేసిన నిపుణులు సహా విభిన్న నేపథ్యాలకు చెందిన నిష్ణాతులున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కమిటీ పేర్కొంది.

**మూడేళ్ల కాంట్రాక్ట్**

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు. పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి సంబంధించిన జీతం, ఇతర ప్రయోజనాలను చర్చల ద్వారా నిర్ణయిస్తారు. ట్రస్ట్ ప్రత్యక్ష నిర్వహణలో పనిచేస్తూ, సీఈఓ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకతను పాటిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీలతో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. మతపరమైన ఆచారాలు, పండుగలను పర్యవేక్షిస్తారు. భక్తుల భద్రతను, సౌకర్యాలను చూసుకుంటారు. విశిష్ట అతిథుల కోసం ఏర్పాట్లు చేస్తారు. ట్రస్ట్ రోజువారీ కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు చోరీకి గురయ్యాయని, కానుకల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వహణ కోసం ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)ను నియమించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కాగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్?లో ఎఫ్?ఐఆర్? నమోదైంది. ఇప్పటి వరకు ఈ కేసులో కనీసం 8 మందిని అరెస్టు చేశారు.

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కోర్టులు, కాలపరిమితితో కూడిన విచారణలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రకాల కేసులకు ఒకే కాలపరిమితిని నిర్ణయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేసుల స్వభావాన్ని బట్టి తగిన సమయాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక అంశాలపై మాట్లాడారు.

**ప్రతి కేసుకూ ఒకే గడువు కాదు**

దేశంలోని న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ కొనసాగుతుండటం పెద్ద సవాలేనని సీజేఐ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి జిల్లా, సెషన్స్ కోర్టుల వరకు ఈ సమస్య ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రతి కేసు నిర్ణీత సమయంలో త్వరగా పరిష్కారం కావాలన్న ప్రజల ఆకాంక్ష సమంజసమేనని చెప్పారు. అయితే ప్రతి కేసుకు ఒకే కాలపరిమితిని వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. కేసుల స్వభావం, సంక్లిష్టత, అంశాల ఆధారంగా విచారణకు అవసరమైన సమయం మారుతుందని వివరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ఆధారంగా కేసులకు తగిన కాలపరిమితులను నిర్ణయిస్తామని తెలిపారు.

**ప్రత్యేక కోర్టులతో వేగవంతమైన తీర్పులు**

కేసుల పరిష్కారంలో ప్రత్యేక కోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీజేఐ అన్నారు. ప్రభుత్వ సహకారంతో తీవ్రమైన నేరాలకు సంబంధించిన విచారణల కోసం ఏడాది వ్యవధిలోనే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. వివాహ, కుటుంబ వివాదాల కోసం ఫ్యామిలీ కోర్టులు, వాణిజ్య వివాదాల కోసం కమర్షియల్ కోర్టులు, వివిధ అంశాలపై ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకే రకమైన కేసులను ఆయా అంశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయస్థానాలు విచారిస్తే వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భిన్న రకాల కేసులను ఆయా రంగాల్లో నిపుణత కలిగిన కోర్టులు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి**

కేసుల పెండింగ్‌ను పూర్తిగా తగ్గించడంలో న్యాయవ్యవస్థ ఇంకా పూర్తి విజయం సాధించలేదని సీజేఐ అంగీకరించారు. న్యాయమూర్తుల నియామకాలు, ముఖ్యంగా జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వంటి అంశాలు దీనికి కారణమని చెప్పారు. తాను సీజేఐగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కేసుల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే 'డాకెట్ మేనేజ్‌మెంట్'పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా భారీ ప్రభావం చూపే, అత్యంత కీలకమైన కేసులను ముందుగా పరిష్కరించే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు, ఒకే తరహా కేసులను సమూహాలుగా విచారించడం ద్వారా పెండింగ్‌ను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

**న్యాయమూర్తికి సహాయకారిగానే!**

న్యాయవ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నప్పటికీ అది న్యాయమూర్తి స్థానాన్ని భర్తీ చేయకూడదని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయాధికారులు యాంత్రికంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదన్నారు. టెక్నాలజీని న్యాయమూర్తికి సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి తప్ప సాంకేతికతే తీర్పు చెప్పే స్థాయికి వెళ్లకూడదని పేర్కొన్నారు. రాష్ట్రాలు లేదా నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే విధానంపైనా సీజేఐ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రభావం చూపే అంశాలను సుప్రీంకోర్టు విచారించవచ్చని కానీ ఒక రాష్ట్రం లేదా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన అంశాలను ముందుగా సంబంధిత హైకోర్టు ముందు ఉంచాలని సూచించారు. భారత రాజ్యాంగంలో హైకోర్టులకు అత్యంత కీలకమైన స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు రాజ్యాంగపరమైన అధికారాలు ఉన్నాయని వివరించారు. కొన్ని అంశాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు ఉన్న అధికార పరిధి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు ఉన్న పరిధి కంటే విస్తృతంగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు న్యాయం వారి ప్రాంతానికి దగ్గరగా అందాలనే ఉద్దేశంతోనే ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండేలా రాజ్యాంగ నిర్మాతలు వ్యవస్థను రూపొందించారని సీజేఐ అన్నారు. జిల్లా కోర్టులో పరిష్కరించాల్సిన కేసు జిల్లా కోర్టుకే, హైకోర్టుకు సంబంధించిన కేసు హైకోర్టుకే, సుప్రీంకోర్టుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టుకే వెళ్లేలా రాజ్యాంగ వ్యవస్థను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రజలపై చేతబడులా?

-మొదటిపేజీ తరువాయి

కూకట్‌పల్లిలో రూ.వందల కోట్ల విలువైన 11 ఎకరాల స్థలాన్ని కేటాయించి, పేదలు నివసించే ప్రాంతంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఐటీ కంపెనీల నడుమ, శిల్పారామం పక్కన రూ.1,000 కోట్ల విలువైన 3.5 ఎకరాల స్థలాన్ని 'ఇందిరమ్మ మహిళా శక్తి' స్టాళ్లకు కేటాయించి, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను, పిండి వంటలను విక్రయించుకునేలా అమెజాన్ లాంటి ఈ--కామర్స్ సంస్థలతో సైతం అనుసంధానం చేశాం. పేదల కోసం నిర్మించే ఇళ్లకు సంబంధించి స్థలాన్ని పూర్తి ఉచితంగా ఇస్తున్నాం. పేదల ఇళ్లకయ్యే రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ లాంటి ప్రాంతాల్లో ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చి పనిచేస్తున్న పేదలకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం..' అని రేవంత్ చెప్పారు.

**22ఏ భూములపై ఆందోళన వద్దు**

'నిషేధిత జాబితా (22 ఏ)ల్లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 22 ఏలో చేరిన భూముల సర్వే నంబర్లకు బై నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తాం. కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలం అంగుళం కూడా ఎక్కడికీ పోదు. కోర్టు కేసులున్న స్థలాల వరకు పక్కనపెట్టి మిగతా వాటికి బై నంబర్లు ఇచ్చి సమస్య పరిష్కరిస్తాం. భూములు, కట్టుకున్న ఇళ్లు 100% రిజిస్ట్రేషన్ అయ్యేలా చేస్తాం. సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేసే సంఘాలను, వ్యక్తులను నమ్మొద్దు..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**రూ.8.11 లక్షల కోట్ల అప్పులున్నా సంక్షేమం ఆగదు**

'గత పాలకులు మాపై రూ.8.11 లక్షల కోట్ల భారీ అప్పుల భారం మోపారు. నడుము వంగిపోయే అప్పుల భారం ఉన్నప్పటికీ, రూపాయి రూపాయి కూడబెట్టి ప్రజా సంక్షేమాన్ని నడిపిస్తున్నాం. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే కోళ్లకు, బర్రెలకు వేసే పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.25 కోట్ల మంది ప్రజలకు ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నాం. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నాం..' అని సీఎం తెలిపారు.




**కూకట్‌పల్లి రుణం తీర్చుకుంటా..**

'మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గం నా రాజకీయ ప్రస్థానంలో కీలక పాత్ర పోషించింది. నాడు నిధులు మంజూరు చేసే అధికారం లేకపోయినా బస్తీల్లో ప్రజలు నా వెన్నంటి నిలిచారు. ఆ రుణాన్ని తీర్చుకునే అవకాశం ఇప్పుడు ముఖ్యమంత్రిగా వచ్చింది. కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదేశాలు ఇచ్చా. నియోజకవర్గంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, పాఠశాలలు, కళాశాలల నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచి బోనాలు: పొంగులేటి**

'ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆనాటి ప్రభుత్వం కమీషన్లు రావనే కారణంతో పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమీషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం.. ఎకరా రూ.200 కోట్ల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందని తెలిపారు. తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా, మంత్రుల సిఫారసులు సైతం లేకుండా అందరి ముందు లక్కీ డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్‌తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు.

**మూడింతల ఇళ్లు నిర్మించకుంటే మళ్లీ పోటీ చేయను**

గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నరేళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని, ఒకవేళ అది చేయకపోతే తాను మరోసారి శాసనసభకు పోటీ చేయనని పొంగులేటి ప్రకటించారు. రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని, అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లైక్ కొట్టండి - రివ్యూ పెట్టండి - డబ్బులు పట్టండి

# ఆఫర్‌కు ఆశపడితే అంతే సంగతులండీ!

చాలా మంది గృహిణులు ఇంటి నుంచే డబ్బు సంపాదించి తమ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని ఆశిస్తారు. సైబర్ నేరగాళ్లు అటువంటి మహిళలను మోసపూరితమైన "వర్క్ ఫ్రమ్ హోమ్" ఉద్యోగ ఆఫర్లతో లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారు యూట్యూబ్ వీడియోలను లైక్ చేయడం, ఉత్పత్తి ప్యాకేజింగ్, చేతిరాత పని లేదా నిర్దిష్ట అసైన్‌మెంట్‌లను పూర్తి చేయడం వంటి వివిధ పనులను ప్రచారం చేసి, నమ్మకాన్ని పెంచుకోవడానికి మొదట చిన్న మొత్తాలను చెల్లిస్తారు. ఆ తర్వాత బాధితుల ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బును కాజేస్తారు.

**మహిళ సంఖ్యే ఎక్కువ**

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 'వర్క్ ఫ్రమ్ హోమ్' మోసాల బాధితుల్లో అధిక శాతం మహిళలే ఉన్నారు. సైబర్ ముఠాలు తమ ఖాళీ సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, గూగుల్ వంటి సోషల్? మీడియాలో వెతికే వ్యక్తుల కోసం కాచుకుని ఉంటాయి. వారు ప్రత్యేకంగా మహిళలను నకిలీ వెబ్‌సైట్‌లు, వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలను వాగ్దానం చేసే ప్రకటనలతో లక్ష్యంగా చేసుకుంటారు. ఈ లింక్‌లపై క్లిక్ చేస్తే, వినియోగదారులు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ గ్రూపులకు మళ్లిస్తారు.

హస్తినాపురానికి చెందిన ఒక యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగానికి సంబంధించిన ప్రకటనను చూసింది. గూగుల్‌లో రివ్యూలు పోస్ట్ చేస్తే రోజువారీ పారితోషికం లభిస్తుందని మోసగాళ్లు ఆమెను నమ్మించారు. మొదట్లో ఆమె కొంత ఆదాయం సంపాదించింది. అయితే మరింత సంపాదించడానికి సూచించిన విధంగా డబ్బు పెట్టుబడిగా



పెట్టమని మోసగాళ్లు ఆమెను ఒప్పించారు. దీంతో ఆమె రూ.1.96 లక్షలు బదిలీ చేసి మోసానికి గురైంది.

హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన 58 ఏళ్ల గృహిణి ఇన్‌స్టాగ్రామ్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రకటనను చూసింది. వీడియోలను లైక్ చేసినందుకు డబ్బు చెల్లిస్తామని వాగ్దానం చేసి మోసగాళ్లు ఆమె నుంచి రూ.3.89 లక్షలు వసూలు చేశారు. తన నష్టాలను తిరిగి పొందాలని ఆశతో ఆమె మరో ఆన్‌లైన్ ప్రకటనకు చేతిరాత ఉద్యోగానికి స్పందించి, అందులో ఉన్న నంబర్‌ను సంప్రదించింది.

ఉద్యోగ ధ్రువీకరణ, స్టేషనరీ ఛార్జీలు, ఆధార్, పాన్ తనిఖీలు, ఐటీ చెల్లింపులు, ప్రాసెసింగ్ ఫీజులు, బ్యాంకు లావాదేవీల ఛార్జీల నెపంతో నేరగాళ్లు ఆమె నుంచి మొత్తం రూ.19.18 లక్షలు వసూలు చేశారు. ఈ విధంగా ఒకే మహిళ రెండుసార్లు మోసపోవడం గమనార్హం.

**రూ.లక్షలు సంపాదించవచ్చనే భ్రమ కలిగిస్తారు**

ఒక వ్యక్తి గ్రూపులో చేరిన తర్వాత, మోసగాళ్లు అటువంటి పని ద్వారా భారీ మొత్తంలో డబ్బు సంపాదించినట్లుగా నకిలీ స్క్రీన్‌షాట్‌లను పోస్ట్ చేస్తారు. పెన్సిళ్లు ప్యాక్ చేయడం, గూగుల్‌లో హోటల్ రివ్యూలు రాయడం, లేదా యూట్యూబ్ వీడియోలను 'లైక్' చేయడం వంటి సాధారణ పనులు చేయడం ద్వారా రూ.లక్షలు సంపాదించవచ్చనే భ్రమను వారు కల్పిస్తారు. ఈ వాగ్దానాలను నిజమని నమ్మి, బాధితులు తరచుగా తమ బ్యాంకు ఖాతాలు లేదా పొదుపు ఖాతాల నుంచి డబ్బును బదిలీ చేస్తుంటారు. చివరికి మోసపోయిన తర్వాత వారు తమ డబ్బును తిరిగి పొందలేకపోతారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

ఉద్యోగ అవకాశం కోసం రిజిస్ట్రేషన్ లేదా ఇతర రుసుముల పేరుతో డబ్బు అడిగితే అది ఒక మోసమని గుర్తించాలి.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు ఇస్తామని ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలను చూసినప్పుడు, ఆ ఆఫర్ నిజమో కాదో నిర్ధారించుకోవడానికి నేరుగా ఆ కంపెనీని సంప్రదించాలి.

ఒకవేళ మీరు అటువంటి మోసానికి గురై డబ్బు నష్టపోతే, వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930ని, 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్'ను లేదా మీ స్థానిక పోలీసులను సంప్రదించాలి.

# కార్పొరేట్ పాఠశాలలా.. కబళించే స్కూళ్లా

**హైదరాబాద్ :** ఉత్తమమైన విద్య అందుతుందని.. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధన చేస్తారని.. తమ పిల్లలు ప్రయోజకులవుతారని చాలామంది తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు. అప్పులు తెచ్చి అయినా సరే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు ఉండవని.. ఉపాధ్యాయుల లో జవాబుదా రితనం కనిపించదని.. పిల్లలకు సక్రమమైన విద్య అందదని భావించే తల్లిదండ్రులు.. తమ స్తోమతకు మించినా సరే పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడి.. విద్యార్థులకు ఉత్తమమైన విద్య అందించి.. మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ.. విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. పైగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారు. విద్యార్థులతో



స్నేహపూర్వకంగా మెలగాల్సిన చోట దారుణంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న దమ్మాయిగూడ లో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక పదవ తరగతి విద్యార్థిని తోటి విద్యార్థులు కర్రలతో కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు.. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన అభిషేక్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఆసుపత్రి యాజమాన్యం మరో విధంగా చిత్రీకరించడం మొదలుపెట్టింది. ఆ విద్యార్థి మెట్లపై నుంచి పడినట్టు చెబుతోంది. వాస్తవానికి విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేలాగా యాజమాన్యం కృషి చేయాలి. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం బాటలు పరచాలి. తోటి విద్యార్థుల మధ్య ఈ స్థాయిలో ర్యాగింగ్ జరిగింది అంటే అది ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యమే. ఉన్నతమైన చదువులు చెప్తారని శ్రీ చైతన్య లో చేర్పించాం. భారీగా ఫీజులు కూడా చెల్లిస్తున్నాం. అయినప్పటికీ ఇక్కడ విద్యార్థులకు సరైన సెక్యూరిటీ లేదు. తోటి విద్యార్థులు ఒకరిని ఒకరు కొట్టుకుంటుంటే మేనేజ్మెంట్ ఏం చేస్తోంది.. విద్యార్థులను పర్యవేక్షించాలి కదా.. నిత్యం కనిపెట్టుకొని ఉండాలి కదా. ఇంతలా దాడులు చేసుకున్నారంటే ఏమనుకోవాలి.. ర్యాగింగ్ విష సంస్కృతి ఈ స్థాయిలో పెచ్చరిల్లిపోతుంటే మేనేజ్మెంట్ నిశ్శబ్దంగా ఉంది.. మా అబ్బాయి పరిస్థితి చూస్తే దారుణంగా ఉందని అభిషేక్ తల్లిదండ్రులు చెప్తున్నారు. మరి దీనిపై యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

## నకిలీలకు చెక్..

-మొదటిపేజీ తరువాయి

అనే అక్షరాలు ఉంటాయి. సాధారణ ముద్రణతో నకిలీ చేయడానికి వీలులేని మైక్రోటెక్స్ట్, ప్రత్యేక కోణంలో చూసినప్పుడు మాత్రమే కనిపించే '+శీ+', 'హతీఅస్త్రఅఖశ్రీ' వంటి పదాలను కూడా ఇందులో పొందుపరిచారు. వీటితో పాటు, కాంతికి ఎదురుగా ఉంచినప్పుడు కనిపించే వాటర్‌మార్క్ లోగో, అతినీలలోహిత కాంతిలో మెరిసే ఇన్విజిబుల్ లోగో, కార్డు వివరాలను ధ్రువీకరించే ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, గిలోష్ ప్యాటర్న్ వంటి అత్యాధునిక సాంకేతికతను జోడించారు. కరెన్సీ నోట్లు, పాస్‌పోర్టుల తయారీలో అనుసరించే అత్యున్నత భద్రతా ప్రమాణాలను ఈ కార్డుల తయారీలోనూ పాటించడం ద్వారా నకిలీ కార్డుల ముద్రణను పూర్తిగా నిరోధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.6 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. ఈ నూతన స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందేలా చూడటమే తమ అంతిమ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## బీసీ మహిళలకు ఫ్రీగా ఆటోమేటెడ్ కుట్టుమిషన్ల పంపిణీ

-మొదటిపేజీ తరువాయి

అందజేస్తామని చెప్పారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

**పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు**

మహిళా ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్న పొన్నం ప్రభాకర్,? సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని స్పష్టం చేశారు. స్వయం ఉపాధి, టైలరింగ్, వ్యాపార అవకాశాలతో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు.

**నియోజకవర్గానికి 1000 మిషన్లు**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1,000 చొప్పున మిషన్లు కేటాయించామని మంత్రి తెలిపారు. తెలంగాణలో మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను బీసీ మహిళలకు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. బీసీ మహిళలకు నియోజకవర్గానికి 1000 ఆటోమేటిక్ కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నాం. బలహీనవర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్సం. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది.

**ఆధునిక ఆటోమేటిక్ మిషన్లు**

పాతకాలపు చేతి మిషన్ల కంటే వేగంగా, తక్కువ శ్రమతో ఎక్కువ దుస్తులు కుట్టడానికి వీలుగా ఉండే ఆటోమేటిక్ కుట్టు మిషన్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తోంది. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లు అందించడం ఈ పథకం ప్రత్యేకత. ఆధునిక కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు.

## కాంగ్రెస్ ఉన్నంత కాలం దేశంలో లౌకికవర్గాలకు మనుగడ

-మొదటిపేజీ తరువాయి

చూపాలని సవాల్ విసిరామని అన్నారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం దేశంలో లౌకిక వర్గాలకు మనుగడ ఉంటుందని, లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

**వాళ్లు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేస్తారు**

బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదని, ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారని సీఎం విమర్శించారు. డబ్బులున్న వాళు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేస్తారని, ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసిన వారి నియామకానికి గతంలో కృషి చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఆర్ఎంపీ వైద్యుడిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిని చేసిందని, తమ అనుయాయులను పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను చేశారని ఆరోపించారు. "కాంగ్రెస్ పార్టీ అంటే సెక్యూలర్, కాంగ్రెస్‌కు హిందూ, ముస్లింలు రెండు కళ్లు లాంటి వారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. వెంటనే చాలామంది దీన్ని వ్యతిరేకిస్తూ మైనార్టీ రిజర్వేషన్లు అవసరంలేదని మాట్లాడారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసి ఈ రిజర్వేషన్లు తీసేయాలని ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రిజర్వేషన్లు తీసుకొస్తే వాటిని రద్దు చేయడంలో నరేంద్ర మోదీ, అమిత్ షా విఫలమయ్యారు. అమిత్‌షా తెలంగాణలోని చేవళ్లకు వచ్చి మాట్లాడారు. వారి పాలనలో మైనార్టీ రిజర్వేషన్లు తీసేస్తామని హామీ ఇచ్చారు. ధైర్యం ఉంటే తెలంగాణలో కాదు గుజరాత్‌లోని మైనార్టీ రిజర్వేషన్లు తీసేయండి మేం చూస్తామని చెప్పాం"

హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడను : కాంగ్రెస్ వచ్చాక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామన్న రేవంత్ రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో విద్యావంతులను నియమించామని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్-1 పోస్టుల భర్తీ చేపట్టామని, గ్రూప్-1 రద్దు చేయాలని సుప్రీంకోర్టు వరకు బీఆర్ఎస్ నేతలు వెళ్లారని ఆరోపించారు. సుప్రీంకోర్టులోనూ మంచి లాయర్‌ను పెట్టి గ్రూప్-1 నియామకాలు పూర్తి చేశామని, గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడించారు. హిందూ, ముస్లింలను వేర్వేరుగా చూడనని, రెండు కళ్లలా చూస్తానని స్పష్టం చేశారు. నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3 కోట్ల ప్రోత్సాహకం ఇచ్చామని, క్రికెటర్ సిరాజ్‌కు ఉద్యోగం ఇవ్వడం అంత తేలిక కాదని, నిబంధనలు పక్కనపెట్టి సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామని గుర్తు చేశారు.

## రీల్ టీచర్స్....

**ఖమ్మం :** ఆమె పేరు గౌతమి రాథోడ్. పేరుకు తగ్గట్టుగానే అందంగా ఉంటుంది. గొంతు కూడా శ్రావ్యంగా ఉంటుంది. పైగా గవర్నమెంట్ టీచర్. రీల్స్ చేయడం ఆమె చాలా ఇంట్రెస్ట్. తాను పనిచేస్తున్న స్కూల్లో రీల్స్ చేసేది. రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పాపులారిటీ సంపాదించుకుంది. సెలబ్రిటీ అయిపోయింది. అనుసరించే వారు కూడా భారీగా ఉండటంతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చిన ఫేమ్ ద్వారా ఆమె కొన్ని ప్రవేట్ సంస్థలకు ప్రచారం చేస్తున్నట్టు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విచారణ నిర్వహించారు. ఆమెను సస్పెండ్ చేశారు. ఇటీవల ఆమెకు పోస్టు లభించింది. విధుల్లోకి వెళ్లాల్సిన ఆమె సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో రిలీజ్ చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమె నిర్ణయం ఒక రకంగా సంచలనం కలిగించింది. ఆమె రీల్స్ చేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు హేళనకు గురిచేసారట. ఆమెను ఇబ్బంది పెట్టారట. తట్టుకోలేక కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని వదులుకున్నానని గౌతమి సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసింది. తాను స్కూల్లో.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఎటువంటి రీల్స్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. ఒకవేళ తాను అలా రీల్స్ చేసి ఉంటే విద్యార్థులు లేదా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తనమీద ఫిర్యాదు చేసి ఉండేవారు కదా అంటూ ఆమె ప్రశ్నించారు. అప్పట్లో గౌతమి మీద విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసినప్పుడు.. దానిని తొలగించాలని ఆమె ఏకంగా ఆరు నెలల పాటు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగింది. చైతన్య జై ని ఆమెను కనీసం పట్టించుకోలేదు. తనను మనిషిలా కూడా చూడలేదని గౌతమి తన సెల్ఫీ వీడియోలో వాపోయింది. ఒక దశలో చైతన్య ఆమెను ఉద్దేశించి నువ్వు నా దగ్గరికి రావద్దు.. వెళ్లిపో అంటూ గట్టిగా కేకలు వేశారని గౌతమి సోషల్ మీడియాలో వాపోయింది. తన మీద ఆరు నెలలపాటు సస్పెన్షన్ వేటి వేసినప్పుడు తోటి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయ సంఘాలు కనీసం అండగా నిలబడలేదని గౌతమి వాపోయింది. సరిగ్గా 6 నెలల క్రితం గౌతమి గురించి తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడిచింది. రీల్స్ టీచర్గా ఆమె పేరు పొందింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026

## సంపాదకీయం

# డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు. ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు. 2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్‌ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ?అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళ్తున్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

## మోడీ బహుమతుల వేలంతో

# 52 కోట్లకు పైగా నిధులు

**న్యూఢిల్లీ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ–వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు,



స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం. అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి. ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది. ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

# వర్సిటీల నిధులు రాజకీయం కావొద్దు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి సాయంతో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు గత ఏడాది ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రెండు హాస్టళ్ల ప్రారంభానికి ఆహ్వానించడంతో సీఎం అదే నెలలో వారికి సమయం ఇచ్చారు. కేసీఆర్ హయాంలోనే మంజూరై నిర్మాణం మొదలైన హాస్టళ్లను ముఖ్యమంత్రి ఆరంభించి, ఠాగూర్ ఆడిటోరియంలో ప్రసంగించడం ఆనాటి కార్యక్రమాలు. విద్యార్థులు, పాలకుల కలయిక అంటే భద్రతా సిబ్బందికి కత్తి మీద సామే. సీఎం కార్యక్రమంలో ఎలాంటి నిరసనలు ఉండకూడదని ముందురోజు రాత్రే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను గృహ నిర్బంధం చేశారు. విద్యార్థులు సమూహాలుగా రాకుండా ఇనుప కంచెలు మొలిచాయి. ఉత్సాహంగా సీఎం యూనివర్సిటీ అభివృద్ధి పనులకు రూ.వెయ్యి కోట్లు హామీ ఇస్తూ డిసెంబర్‌లో మరో సమావేశం పెట్టుకుందామన్నారు. సీఎం అన్నట్లుగానే వర్సిటీ రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్ల మంజూరు ఉత్తర్వు వచ్చేసింది. అదే ఏడాది డిసెంబర్ 10వ తేదీన ఆర్ట్స్ కాలేజీ ముందు అశేష విద్యార్థుల సమక్షంలో ఆ జీవో కాపీని రేవంత్‌రెడ్డి అధికారులకు అందజేశారు. 109 ఏండ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీకి ఏ ప్రభుత్వమూ ఒక్కసారిగా ఇంత సొమ్మును ప్రకటించలేదు. అధికారులు, అధ్యాపకులు, విద్యార్థుల కండ్లల్లో కొత్త భవనాలు, ఆధునిక వసతుల ఊహలు వెలిగిపోయాయి. అధికారులు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తూ 'కొత్త భవనాలు ఉంటే సరిపోదు. వెయ్యికి పైగా ఉన్న బోధనా సిబ్బంది ఖాళీలను కూడా పూరిస్తేనే తగిన ప్రయోజనం ఉంటుంది' అని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అదేరోజు విద్యార్థులు సూచనలు, ఆలోచనలను తమతో పంచుకోవాలని ఒక క్యూఆర్ కోడ్‌ను కూడా సీఎం విడుదల చేశారు. కానీ ఆ కోడ్‌ను ఎప్పుడు స్కాన్ చేసినా ఏ సర్వర్‌కు దీనిని అనుసంధానించలేదని మెసేజ్ వస్తున్నది. అది అలా ఉండగా ఇంతవరకు సీఎం అందించిన జీవో 189 ప్రకారం రూ.వెయ్యి కోట్లలో ఒక్క విడత కూడా నిధులు యూనివర్సిటీ అధికారులకు చేరిన దాఖలాలు లేవు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ ఏడాది మే 26న వర్సిటీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో విద్య కోసం 8.2 % నిధులను కేటాయించింది. ఇదే సంవత్సరంలో కర్ణాటక, 12%, ఏపీ 14% బడ్జెట్ విద్యకు అందిస్తున్నాయి. కాంగ్రెస్ నేతలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యాభివృద్ధి కోసం కనీసం 15% నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ 18% నిధులను



విద్యకు వెచ్చించాలని సూచించింది.

2026–27 బడ్జెట్ కేటాయింపు ప్రకారం రూ.26,587 కోట్లు విద్యా విభాగానికి వస్తే అందులో రూ.21 వేల కోట్లు స్కూల్ ఎడ్యుకేషన్‌కే అవసరం. అయితే ఈ కేటాయింపు ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణ, అభివృద్ధికి చెందుతుంది. నిర్వహణలో సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి అంటే కొత్త నిర్మాణాలు, కొనుగోళ్లు వస్తాయి. ప్రభుత్వ నిధులు దేనికి విడుదల చేస్తే దానికే వాడుకోవాలి. కేటాయింపు అభివృద్ధి పేరిట వస్తేనే విద్యాసంస్థల సదుపాయాలకు వర్తిస్తుంది. 2025–26 బడ్జెట్‌లో యూనివర్సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కేటాయిస్తే కేవలం రూ.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. సాంకేతిక విద్యకు వెచ్చించాల్సిన రూ.14 కోట్లలో ఒక కోటి మాత్రమే విడుదలైంది. హైదరాబాద్‌లోని మరో ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీ హోదా కల్పించి 'తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం' అని నామకరణం చేసింది. 2024లో ప్రస్తుత ప్రభుత్వం ఆ యూనివర్సిటీ పేరులో 'తెలంగాణ'ను తొలగించి 'వీరనారి చాకలి ఐలమ్మ' పేరును చేర్చింది. ఉస్మానియా యూనివర్సిటీ మాదిరిగానే ఈ విద్యాసంస్థకు కూడా ప్రభుత్వం ఈ ఏడాది రూ.514 కోట్లు కేటాయించింది. అయితే ఈ సంస్థకు ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా నిధులు విడుదలైనట్లు తెలుస్తున్నది. ఓయూకు రావలసిన రూ.వెయ్యి కోట్లకు తగినట్లు ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. యూనివర్సిటీ గేట్ నుంచి మొదలు 19 రకాల మార్పులకు రచన పూర్తయింది. కొత్త భవంతులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, లైబ్రరీ, జిమ్, యాంఫీ థియేటర్, మల్టీ పర్పస్ హాల్, డైనింగ్ సెంటర్, ఆరోగ్య కేంద్రం ఇలా ఉస్మానియాను ప్రపంచ స్థాయిలో ఒకటిగా మార్చే ఎన్నో ఆలోచనలు వారి మదిలో ఉన్నాయి. క్యాంపస్ మొత్తంగా డిజిటల్ సమాచార వ్యవస్థ, ఉత్తమ విద్యార్జన వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతుల సదుపాయం కల్పించవచ్చు. మారుతున్న విద్య, ఉద్యోగ అవకాశాల కారణంగా యూనివర్సిటీలో చేపట్టవలసిన మార్పులు భారీగానే ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ ఆవరణలో ఉన్న చాలా కోర్సులు వివిధ కారణాల వల్ల జీవనోపాధిని అందించలేకపోతున్నాయి. 1980 వరకు పీజీ చేసినవాళ్లు ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు అయ్యేవారు. ఇప్పుడు సబ్జెక్టుల ప్రాథమ్యాలు మారిపోయి మ్యాథ్స్, సైన్స్ చదువులు పెరిగిపోయాయి. ప్రభుత్వ కాలేజీలు తగ్గిపోయి విద్య ప్రైవేట్ హస్తగతం అయింది. విద్యావిధానంలో టెక్నాలజీ పాత్ర పెరిగిపోయింది. కొత్తగా వచ్చిన కృత్రిమ మేధ ప్రపంచాన్ని ఏలుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యాసంస్థలు కొత్త రూపు సంతరించుకోకపోతే అవి కాలగర్భంలో కలిసిపోతాయి. యూనివర్సిటీలకు భారీ నిధుల కేటాయింపు రాజకీయ పన్నాగం కారాదు. ఉత్తుత్తి ప్రమాణంగా మిగులకూడదు. ఉస్మానియా యూనివర్సిటీ పేరు ప్రఖ్యాతులు నిలువాలంటే తగిన నిధులతో ఆధునీకరణ తప్పనిసరి. విద్యార్థుల కలలను నిజం చేయాలి.

## అవును.. భారత్ ప్రతిఘటిస్తున్నది

దేశంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలనపై యువత తప్పకుండా స్పందించే సమయం వస్తుందని కేసీఆర్ రెండేండ్ల క్రితం అన్నారు. ఇండియా రియాక్ట్స్ అంటూ ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యాలని నిరూపితమవుతున్నది. జంతర్ మంతర్‌లో విద్యార్థుల నిరసన ఉద్యమం తాజా నిదర్శనం. నాడు ఈస్టిండియా పాలకుల దోపిడీని ప్రతిఘటిస్తూ గాంధీజీ నాయకత్వాన అహింసా ఉద్యమం ప్రబలినట్టే నేడు యువత పోరాటబాట పట్టింది. బీజేపీ పన్నెండేండ్ల పాలనలో ప్రకృతి వనరులు, ప్రభుత్వ భూములు, సంస్థలు, అడవులు, అయోధ్య రామాలయ విరాళాల దోపిడీ వ్యవహారాలు వెలుగుచూశాయి. లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాల ఎగవేతలు యథేచ్ఛగా జరిగాయి. 152 సార్లు పబ్లిక్ పరీక్ష ప్రశ్నాపత్రాలను కూడా అమ్ముకుతింటున్న ముఠాల వ్యవహారం బయటపడింది. దేశంలో సాగుతున్న నిత్య దోపిడీని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నాయకత్వాన నిరసన ఉద్యమం ప్రజ్వరిల్లింది. దీన్ని కప్పిపెట్టేందుకు జాతీయ మీడియా చెమటోడ్చింది. అయినాసరే జర్నలిస్టులు, సోషల్ మీడియా ప్రతినిధులు, యువత, విద్యార్థులు ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమంలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది విద్యార్థులు చేరుకున్నారు. ఆకాశం కప్పుకింద, దిక్కుల గోడల మధ్య, నేలపైనే నిద్రిస్తూ నిరసన తెలిపారు. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా ఆ బిడ్డలకు అన్నపానీయాలను పంపడం, డాక్టర్లు ఉచిత వైద్యసేవలు, మందులు అందించడం వంటి వీడియోలు వైరల్‌గా మారాయి. వివిధ మతాల పెద్దలు తమ ప్రార్థనా మందిరాల్లో నిరసనకారులు సేదదీర్చుకునేలా ఏర్పాట్లు చేయడం, రాత్రిపూట విద్యార్థులకు విసనకర్రలతో స్థానికులు సేవలు అందించడం, అన్ని మతాల ప్రజలు కలసికట్టుగా నినదిస్తూ ఉద్యమించడం వంటి దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బీజేపీపై ఉద్యమం అంటే భయంతో వెనుకంజవేసేవాళ్లకు కూడా ఆత్మస్థైర్యాన్ని కలిగించాయి. మేం భారతీయులం మేమంతా ఒక్కటే అంటూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా యువతరం కదం తొక్కింది. శభాష్ విద్యార్థులారా! యువతీయువకులారా! భారతమాతకు అద్భుతమైన బిడ్డలు అని చాటిచెప్పారు. హేమాహేమీ రాజకీయ పార్టీల నేతలు సైతం జంకుతుంటే, నిర్భయంగా నిరసన గళమెత్తిన వీరులుగా నిలిచారు. ఎదురించేవాళ్లు లేనంతకాలం, బెదిరించేవారిదే రాజ్యం అనేది నానుడి. కానీ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన రైతులు, పేపర్ లీకేజీలపై ఉద్యమించిన విద్యార్థులు దేశానికి దిశానిర్దేశం చేశారు. నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన భారతీయులందరికీ మార్గదర్శకులుగా నిలిచారు. ప్రజావ్యతిరేక విధానాలతో మోదీ ప్రభుత్వం నానాటికీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నది. జంతర్ మంతర్ ఉద్యమమే కాదు, నిన్నటి ఉపఎన్నికల ఫలితాలూ అందుకు సాక్ష్యాలే. ముఖ్యంగా 1995 నుంచి బీజేపీకి వరుస విజయాలను అందిస్తూ వచ్చిన బిహార్‌లోని బాంకీపూర్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో బీజేపీ పరాజయం అందుకు సుస్పష్ట సంకేతం.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్**





**జగిత్యాల, ఆగస్టు13,(నవగీతం):** జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి గురువారం పరిశీలించారు.జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్, పార్కింగ్, భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.రెవెన్యూ,పోలీస్ ,డి ఆర్ డి ఓ మరియు మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తును, ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆహ్వానితులకు, విద్యార్థులకు మరియు ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు, వైద్య సిబ్బంది, శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆమె సూచించారు.ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలని అన్నారు.జిల్లా ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవ దినోత్సవాన్ని గౌరవంగా, దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని ఆహ్వానించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి. రాజ గౌడ్, డిఆర్డిఏ రఘువరన్, డిపి ఆర్ వో శ్రీధర్, సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.వో కిషన్, ఎమ్మార్వో రామ్మోహన్, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, డిఆర్డిఏ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పొలం బాట పట్టిన విద్యార్థులు

**పుస్తకమే కాదు పొలం కూడా వారికి పాఠాలు చెబుతుంది అచ్చ విజయ్ భాస్కర్**



**ఇబ్రహీంపట్నం,ఆగస్టు13,(నవగీతం)** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,గురువారం, పొలం బాట పట్టారు. గ్రామ సమీపంలో మీరా రాజేష్,రైతు పొలంలో విద్యార్థులకు, వ్యవసాయం, పకృతి, రైతుల కష్టాలపై, పంటల సాగు, విధానాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వరి పొలాలను సందర్శించి, వరి నాట్లు వేసే విధానం, నారు పెంపకం, పొలాన్ని సిద్ధం చేయడం, నీటి వినియోగం, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ, దిగుబడి తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు, రైతులు పడే శ్రమ, పంట సాగుకు అయ్యే ఖర్చులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు విద్యార్థులకు వ్యవసాయ ప్రక్రియను సులభంగా వివరించారు. ఈ సందర్భంగా రైతు మీరా రాజేష్ విద్యార్థులతో మాట్లాడుతూ రైతుల కష్టాన్ని, ఆహార ధాన్యాల విలువను వివరించారు. రైతుల శ్రమ వల్లనే మనకు ప్రతిరోజూ ఆహారం లభిస్తుందని, రైతులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యపుస్తకాలలో చదివే విషయాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా వారి అవగాహన మరింత పెరుగుతుందాని,రైతుల శ్రమను, వ్యవసాయం ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకోవడం. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. పొలంబడి -- రైతులతో ముఖాముఖి కార్యక్రమం ద్వారా విద్యార్థులు వ్యవసాయంపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందడంతో పాటు రైతు శ్రమకు గౌరవం, ఆహారం విలువ, ప్రకృతి పట్ల బాధ్యత వంటి విలువలను నేర్చుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత, విద్యార్థిని, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందిస్తాం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**నూతన పెన్షన్ల కోసం ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి**

**గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్ల నుంచే పెన్షన్.. దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన**





**జగిత్యాల, ఆగస్టు13,(నవగీతం):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల పంపిణీ పై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.47 కోట్ల మేర పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అందుతున్న పెన్షన్లకు అదనంగా నూతన పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.గీత కార్మికులు, చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని మంత్రి తెలిపారు. నూతన పెన్షన్లతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతున్నప్పటికీ ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.నూతన పెన్షన్లకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కొత్త పెన్షన్ల కోసం అనేక మంది ప్రజలు తమకు విజ్ఞప్తులు చేశారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపులు గురుకులాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని మంత్రి తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సాగునీటి అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్రంలో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ డి ఆర్ డి ఓ రఘువరన్ సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## మాస్ డ్యాన్స్‌తో షేక్ చేస్తున్న ప్రీతిరెడ్డి

**హైదరాబాద్ :** ఎక్స్ మినిస్టర్ మల్లారెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన ఏం మాట్లాడినా సరే సంచలనంగానే ఉంటుంది. సోషల్ మీడియాలో ఆయన చేసే కామెంట్లు.. వేసే డ్యాన్సులు.. ఇవన్నీ కూడా ట్రెండింగ్లో ఉంటాయి. మల్లారెడ్డి మాత్రమే కాదు.. ఇప్పుడు ఆయన కోడలు కూడా మామ చూపించిన దారిలోనే నడుస్తున్నట్టు తెలుస్తోంది.మల్లారెడ్డికి ఇద్దరు కుమారులు. అందులో భద్రారెడ్డి సతీమణి ప్రీతి రెడ్డి. ఈమె మల్లారెడ్డి విద్యాసంస్థలను పర్యవేక్షిస్తూ ఉంటారు. ఈమెకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం చాలా ఇష్టం. సోషల్ కార్యక్రమాలు కూడా చేపడుతూ ఉంటారు. మల్లారెడ్డి తరహాలోనే కామెంట్లు చేస్తూ ఉంటారు. ఈమె మాట్లాడే మాటలు.. చేసే డ్యాన్సులు ఆసక్తికరంగా ఉంటాయి. అప్పట్లో ఈమె తన మామతో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. చాలాసేపు మాట్లాడుకున్నారు. అప్పట్లోనే ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతుందని వార్తలు వచ్చాయి.గత ఏడాది బోనాల వేడుకలు జరిగినప్పుడు బిజెపి ఎంపీ.. కేంద్రమంత్రి బండి సంజయ్ తో కలిసి ఆమె కార్యకర్త ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం కూడా చేశారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ.



**ఇల్లంతకుంట, ఆగస్టు 13 (నవగీతం):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. దేశంలోని ప్రజలకు హక్కుల తోపాటు బాధ్యతలు కూడా ఉంటాయని భారత రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలన్న భావన ప్రతి పౌరుడు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు,ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన విజయవంతం చేయండి.



**ములుగు,ఆగష్టు 13(నవగీతం)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెల 16 తేదీ న ములుగు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ పిలుపునిచ్చారు. గురువారం వాజేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ కే ఖాజావలి అనుముల సంజీవ జగన్నాథరాజు దాట్ల సీతారామరాజు యూత్ కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి కళ్యాణ్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరారం సర్వేశ్వరరావు బూతు ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మంగపేటలో గొడ్డలితో దాడి ఒకరు దుర్మరణం.

**పూరేడుపల్లి వ్యక్తి అరెస్ట్.**



**ములుగు, ఆగష్టు 13,(నవగీతం)** ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో ఉన్న పాత పెంకుటిల్లులో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం, నరసింహ సాగర్,పూరేడుపల్లి నుండి వ్యవసాయ పనుల కోసం వచ్చిన కూలీలు రాత్రి మద్యం సేవించి బస చేశారు. ఈ క్రమంలో భార్యల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో పూరేడుపల్లికి చెందిన కొప్పుల నరసింహారావు అదే గ్రామానికి చెందిన తాటి శేషు,38 సంవత్సరాలు, అనే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన తాటి శేషు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మంగపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడు కొప్పుల నరసింహారావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనతో కమలాపురం శివారులోని కూలీల మధ్య కలకలం రేగింది.

## వంద శాతం ఫలితాలు సాధించిన పూర్వ విద్యార్థునులకు ఘన సన్మానం.



**ములుగు,ఆగష్టు13,(నవగీతం):** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి-2 ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పూర్వ విద్యార్థులను గ్రామానికి చెందిన చేలే నవీన్ ఘనంగా సన్మానించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా నవీన్ తన తల్లి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ ను సర్పంచ్ ఆదిలక్ష్మి, ప్రధాన ఉపాధ్యాయురాలి చేతుల మీదుగా అందజేశారు.

సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చేలే నవీన్ తల్లితండ్రులు ఇద్దరూ లేకపోయినా తన స్వశక్తితో ఎదిగి, పుట్టిన ఊరికి సేవ చేస్తుండడం గర్వకారణమని నర్సింహమూర్తి, నాగరాజు కొనియాడారు.పుట్టిన ఊరికి మంచి చేయాలనే సంకల్పం గొప్ప లక్షణమని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలని వారు సూచించారు. లక్ష్యం ఉన్నవారే ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో సర్పంచ్, విద్యార్థులతో కలిసి పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చేలే సుజాత తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

**హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీ-లాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపోలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**ఫర్నిచర్, బెంచీలు ఎక్కువ ఉంటే మరో స్కూల్ కు తరలించాలి**
**వనరులను సమర్థవంతంగా వినియోగించాలి**
**కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, ఆగస్టు13,(నవగీతం)** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు,చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు(వాటర్ డిస్పెన్సరీలు ) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు.. అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

**అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన**

ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున.. మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి ..పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.
స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

# ధర్మపురి క్షేత్రం అభివృద్ధితో మారనున్న రూపురేఖలు..

**కుంభమేళా తరహాలో పుష్కరాలు నిర్వహిస్తాం**
**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



**జగిత్యాల/ధర్మపురి,ఆగస్టు13,(నవగీతం)** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా మని ధర్మపురి క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం ధర్మపురి 15వ వార్డు అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ధర్మపురిలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అంబేద్కర్ భవన నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని తెలిపారు. మరో రెండు అంతస్తులు విద్యార్థుల చదువు కావలసిన ఏర్పాట్లు చేస్తామని మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో ధర్మపురిలో రూ. 37 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. వీటితోపాటు టి యు ఎఫ్ ఐ డి సి నిధులు రూ. 15 కోట్లతో పాటు అమృత పథకం ద్వారా నిధులు సాధించి ధర్మపురి లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వివరించారు. ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ధర్మపురి క్షేత్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ధర్మపురి రూపురేఖలు మారనున్న ట్లు మంత్రి వివరించారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ తోపాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..





**టౌన్ సిఐ కరుణాకర్**

**జగిత్యాల, ఆగస్టు 13,(నవగీతం):** వాల్మీకి ఆవాసం సేవా భారతి జగిత్యాల ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటుచేసిన పోలీసు శిక్షణ శిబిరాన్ని వినియోగించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ అన్నారు. గురువారం వాల్మీకి ఆవాసంలో ఏర్పాటుచేసిన సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులను టౌన్ సిఐ కరుణాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి అనేది సమాజంలో ఒక బాధ్యత గల ఉద్యోగం అని దీన్ని సాధించడానికి శారీరక శ్రమతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ కఠోర పరిశ్రమ కూడా ఉండాలన్నారు. ఎంతోమంది గ్రామీణ యువకులకు పోలీస్ ఉద్యోగం మీద మక్కువ ఉన్నప్పటికీ ఆర్థిక భారంతో కలిగిన కోచింగ్ తీసుకోలేని పరిస్థితిలో వారి పోలీస్ ఉద్యోగం కల నెరవేరడం లేదన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వాల్మీకి ఆవాసం ద్వారా హైదరాబాద్ స్థాయిలో శిక్షణనిస్తున్నారని దీన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా భారతి వాల్మీకి ఆవాసం ద్వారా చక్కటి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి తమను భాగస్వాములను చేయడం అభినందనీయం అన్నారు. ప్రధాన వక్త ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవ ప్రముఖ ఆకు రాజేందర్ మాట్లాడుతూ దేశ సేవ, సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ పొందడానికి వచ్చిన యువకులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకొని లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఎస్పి సుబ్రహ్మణ్యం, వాల్మీకి ఆవాస కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, చిత్తారి మధుకర్, అశోక్ రావు, చంద్రశేఖర్, సత్యం, సురేష్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ కు తమిళనాడు క్లియర్

**చెన్నై :** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు శాసనసభ అత్యంత ప్రాధాన్యత కలిగిన తీర్మానాన్ని ఆమోదించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే స్థానాల సంఖ్యను పెంచితే దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుందనే ఆందోళనలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మూడు స్పష్టమైన డిమాండ్లను సభ ముందుకు తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదింపజేసింది.తీర్మానంలో పొందుపరిచిన ప్రధాన ప్రతిపాదనల ప్రకారం? ప్రస్తుతం అమల్లో ఉన్న 1971 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల కేటాయింపు నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలి. ఒకవేళ అనివార్య కారణాల వల్ల స్థానాల సంఖ్యను పెంచాల్సి వస్తే, ఆ పెంపును కూడా 1971 నాటి జనాభా నిష్పత్తి ప్రకారమే చేపట్టాలి. జనాభా నియంత్రణ , సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు తమిళనాడుతో పాటు ఇతర దక్షిణ భారత రాష్ట్రాలను శిక్షించేలా పార్లమెంటరీ స్థానాల సంఖ్యను తగ్గించకూడదనేది మరో కీలక డిమాండ్.అంటే, మూడింటిలో ఏ డిమాండ్ చూసినా.. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని భవిష్యత్తు పునర్విభజనలోనూ ఖచ్చితంగా కాపాడాలనేదే తమిళనాడు ప్రభుత్వ స్పష్టమైన వైఖరి. ప్రస్తుతం

## ఎంపీపీ స్కూల్‌లో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు వేధింపులు

**డీఈఓకు ఫిర్యాదు**

**ఖమ్మం,ఆగస్టు 13(నవగీతం):** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల ఎంపీపీ స్కూల్‌లో ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గొలుసు సింధుపై అదే పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆమడల ప్రసాద్ వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన భార్యకు ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశంతో, సింధు విధులకు ఆటంకం కలిగిస్తూ, తరగతి గదిలోకి వచ్చి సెల్ ఫోన్‌తో ఫోటోలు, వీడియోలు తీస్తూ ఆమెను బెదిరిస్తున్నారని బాధిత ఇన్‌స్ట్రక్టర్ డీఈఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులతో తనపై తప్పుడు ప్రచారం చేయిస్తూ, పిల్లలను తన తరగతి గది నుండి బలవంతంగా మొదటి తరగతి గదుల్లోకి మారుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా జరుగుతున్న ఈ వేధింపుల వల్ల తన విధులు నిర్వహించడం కష్టంగా మారిందని సింధు వాపోయారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని, తన విధులకు రక్షణ కల్పించాలని ఆమె జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన చేపట్టాలి..

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**





**కరీంనగర్, ఆగస్టు13,(నవగీతం)** కరీంనగర్ ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం పరిశీలించారు. అంతకుముందు డాక్టర్ స్ట్రీట్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆమె సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లీకేజీలు, కిచెన్ షెడ్డు, తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను ముక్రాంపురంలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలించి, అక్కడే హాస్టల్ వసతితో పాటు తరగతుల నిర్వహణ, విద్యాబోధన కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.ఈ మేరకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కొద్దిరోజుల పాటు విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటూ, తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యార్థులను తిరిగి అక్కడికి తరలించాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## టైలరింగ్ నైపుణ్యానికి సీఎస్సీ సర్టిఫికెట్

**జగిత్యాల,ఆగస్టు13,(నవగీతం)** కుట్టుమిషన్ (టైలరింగ్) పనిలో అనుభవం ఉండి ఎలాంటి అధికారిక సర్టిఫికెట్ లేని మహిళలకు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా సీఎస్సీ సమన్వయకర్త జలంధర్ తెలిపారు. సీఎస్సీ ఆధ్వర్యంలో టైలరింగ్ కోర్సుకు నమోదు చేసుకున్న మహిళలకు ఒకే రోజులో సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్‌లో నైపుణ్యం కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభకు అధికారిక గుర్తింపు పొందవచ్చన్నారు. ఈ సర్టిఫికెట్ ప్రైవేటు ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు, బ్యాంకు రుణాలు పొందేందుకు ఉపయోగపడుతుందని వివరించారు.జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరిన ఆయన, టైలరింగ్ సర్టిఫికెట్ కోసం సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లను సంప్రదించాలని సూచించారు.




## జిల్లాలో పెద్ద ఎత్తున ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

**రైతుల్లో మరింత అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్,ఆగస్టు13,(నవగీతం):**జిల్లాలో పెద్ద ఎత్తున ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ఆరుతడి పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల వైపు వారిని ప్రోత్సహించాలని సూచించారు.గురువారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గత సంవత్సరం ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం, ప్రస్తుత సంవత్సరం సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సరం జిల్లాలో సుమారు 6 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు కాగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 16 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి, ఆరుతడి పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.మొక్కజొన్న, వేరుశనగ, ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పండ్ల తోటల సాగుపై రైతులు ఆసక్తి చూపేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ సిబ్బంది పనిచేస్తూ, పంటల ఎంపిక నుంచి సాగు విధానాల వరకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, హుజురాబాద్ వ్యవసాయ అధికారి భూమ్ రెడ్డి, జమ్మికుంట వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్‌తో పాటు పలువురు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026

## విబ్ జి రామ్ జి పథకం కింద ఎకో పాండ్ మరియు

# వెదురు సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను వేసిన రైతులు రిజిస్ట్రీ చేసుకునేలా రైతు వేదికల ద్వారా తెలియజేయాలి

పంటల ప్రస్తుత స్థితిగతులతో మంత్రి ఆరా

డిపార్ట్ మెంట్ల వారిగా ఆస్థులు మరియు భూముల వివరాలు ప్రభుత్వానికి అందించాలి

నకిలీ డిఏపి తయారుచేసిన వారిపై కఠిన చర్యలు.. 8 మందిపై కేసులు, 6 గురు అరెస్ట్

మార్కెట్లలో ఆర్ డి వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి : మార్కెటింగ్ డైరెక్టర్ కు ఆదేశం



సచివాలయంలో తన శాఖ పరిధిలోని వివిధ శాఖలు, సంస్థల ఉన్నతాధికారులతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని, రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విబ్ జి రామ్ జి కింద ఎకో పాండ్లు మరియు వెదురు సాగు చేపట్టేలా పంచాయతీరాజ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను సాగు చేసిన రైతులు, ఎఈఓ ల దగ్గర రిజిస్ట్రీ చేసుకునే విధంగా రైతువేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుత పంట పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఇప్పటివరకు రైతులకు సబ్సిడీపై ఎన్ని వ్యవసాయ యంత్రాలు అందించారనే వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యంత్రాల పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. రైతులకు సేవలందించేందుకు అవసరమైన మేరకు ఉద్యోగులను భర్తీ చేసుకోవాలని, అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది కొరతను కారణంగా చూపించే పరిస్థితి ఉండకూడదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి పైసాను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

మార్క్‌ఫెడ్‌కు మంజూరైన 65 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణాలను వరి అధికంగా పండించే జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని మంత్రి సూచించారు. ఉద్యోగుల హాజరుపై రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖల్లో అమలు చేసి, ప్రతి ఉద్యోగి హాజరును అందులో నమోదు చేయాలని ఆదేశించారు. విధులకు ఆలస్యంగా వచ్చే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఒకే తరహా విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే అవకాశాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను మంత్రి ఆదేశించారు. దీనివల్ల పరిపాలనా వ్యవస్థ మరింత సరళంగా మారడంతో పాటు పర్యవేక్షణ సమర్థవంతంగా ఉంటుందని అన్నారు.

**ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలి**

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను వెంటనే విక్రయించి, వచ్చే నెలకు కొత్త మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఎక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంటే ఆ జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మొక్కలు లేవనే సమాధానం రాకూడదని, రెండు మూడు రోజుల్లోనే వారికి మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నర్సరీలు లక్ష్యం కంటే రెండింతల మొక్కలను పెంచాలని, ఖర్చు ఎంతైనా నాణ్యమైన విత్తనాలను సమకూర్చి అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన మొక్కలను రైతులకు అందించాలని ఆదేశించారు. సంవత్సరానికి 2 లక్షల ఎకరాలు లక్ష్యం పెట్టుకొని అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అన్ని శాఖల వద్ద ఉన్న భూములు, ఆస్తుల వివరాలను తెప్పించుకుని, నర్సరీలకు భూమి అవసరమైతే ఇతర శాఖల ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సెక్రటరీని ఆదేశించారు. డ్రిప్ కంపెనీలతో మాట్లాడి ఆయిల్‌పామ్ కంపెనీలే రైతులకు నేరుగా డ్రిప్ వ్యవస్థలను ఏర్పాటు చేసేలా చూడాలని సూచించారు.

ఆయిల్‌పామ్ మిల్లుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ట్రయల్ రన్స్ ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన గడువులు పూర్తయిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నాయని చెప్పడం సరికాదన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతుల్లో మరింత ఉత్సాహం కలుగుతుందని అన్నారు. హైదరాబాద్‌లోని విజయ ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మిడ్‌డే మీల్స్ కార్యక్రమాలకు అవసరమైన కూరగాయలను ఆయా ప్రాంతాల్లోని రైతుల నుంచే కొనుగోలు చేసేలా, అలాగే వంట నూనెగా విజయ ఆయిల్‌ను వినియోగించే అంశంపై హరేకృష్ణ చారిటీ ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడాలని అధికారులను ఆదేశించారు.

**నకిలీ డీఏపీపై కఠిన చర్యలు**

నకిలీ డీఏపీ తయారీకి సంబంధించి 8 మందిపై కేసులు నమోదు చేసి, 6 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని మంత్రి తుమ్మల ఆదేశించారు. నకిలీ డీఏపీ ఎంతమేరకు, ఎవరెవరికి విక్రయించారో పూర్తి వివరాలు సేకరించి, నష్టపోయిన రైతులకు సంబంధిత వ్యక్తుల నుంచే పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# అత్యుత్తమ దానం - అవయవ దానం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్

**మహబూబాబాద్ :** జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' సందర్భంగా గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి శ్రీమతి షాలిని షాకెల్లి అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు సంస్థ చైర్మన్ కె. మురళి మోహన్ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ? న్యాయ మూర్తి మాట్లాడుతూ.. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వారికి తోడు పడవోయ్' అన్న గురజాడ మాటలకు నిలువెత్తు నిదర్శనం అవయవ దానమని, ఒకరి చిన్న త్యాగం మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు."బ్రెయిన్ డెడ్ (మస్తిష్క మరణం) పొందిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంతో ముందుకు వచ్చి అవయవ దానానికి అంగీకరిస్తే, ఎంతోమంది నిరాశలో ఉన్న బాధితులకు నూతన జీవితాన్ని అందించవచ్చని తెలిపారు.? అవయవ దానం పట్ల సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ దీనిపై విస్తృత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.? 'మానవ అవయవాల మార్పిడి చట్టం' మరియు అవయవ దాన నమోదు ప్రక్రియపై న్యాయపరమైన అంశాలను వివరించారు. అననంతరం అవయవ దానం ద్వారా కాలేయ మార్పిడి జరిగినటువంటి గ్రహీత పరకాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అవయవాల కోసం ఎదురు చూసే వారికి జీవన్ దాన్ సంస్థ వరం లాంటిదాన్నారు. హైదరాబాద్ లోని నిమ్స్ కేంద్రంగా ఇది పనిచేస్తుండగా అవయవం అవసరమైన వారు జీవన్ దాన్ పోర్టల్ లో




నమోదు చేసుకోవాలని తెలియచేశారు. అనంతరం న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ..పుట్టుక నీది చావు నీది, బ్రతుకంతా సమాజానిది' అన్న కాళోజీ మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని బ్రతికి ఉన్నంత కాలం సమాజానికి సేవ చేయడమే కాక, మరణానంతరం కూడా తన అవయవాల ద్వారా మరొకరి శరీరంలో జీవాన్ని నిలపడం కంటే పెద్ద సమాజ సేవ మరొకటి ఉండదన్నారు.ఈ సందర్భంగా అవయవ దానం, నేత్ర దానం మరియు శరీర దానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సమ్మతి పత్రాలను పూరించి అందించిన ఉదార స్వభావులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. వారి సామాజిక బాధ్యతను, దేశభక్తిని కొనియాడుతూ వారికి 'జాతీయ జెండా'ను ప్రశంసా పూర్వకంగా అందజేసి సత్కరించారు.?ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీమతి స్వాతి మురారి , అర్వపల్లి కృష్ణతేజ్, కోర్ట్ సిబ్బంది, సమన్వయ అధికారి,కోర్టు విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్స్, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు

# జేబీపీ పోరాటంతో డీపీఆర్ టెండర్ రద్దు

**టెండర్ రద్దుతో చేతులు దులుపుకోవడం కాదు.**

**.అవినీతి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**ప్రజా పోరాటాలకు ఎవరైనా తలవంచాల్సిందే**

**జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**

**పాల్వంచ :** కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి,అక్రమాలకు వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరంతర ప్రజా పోరాటానికి మరోసారి విజయం లభించిందని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.జైభీమ్ రావ్ భారత్ పార్టీ పోరాటం నేపథ్యంలో డీపీఆర్ టెండర్‌ను రద్దు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.పాల్వంచ ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ..ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, పారదర్శకతకు తావులేకుండా వ్యవహరిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై న్యాయబద్ధంగా, నిరంతరం పోరాటం చేస్తే చివరకు అధికార యంత్రాంగం కూడా ప్రజల డిమాండ్లకు తలవంచాల్సిందేనని అన్నారు."డీపీఆర్ టెండర్ రద్దు చేయడంతో సమస్య పూర్తయినట్లు అధికారులు




భావించకూడదని",టెండర్ ప్రక్రియలో అవినీతి,అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేవలం "టెండర్ రద్దు చేసి చేతులు దులుపుకోవడం ప్రజలను మోసం చేయడమే" అని యెర్రా కామేష్ వ్యాఖ్యానించారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే ఏ ప్రయత్నాన్నైనా జైభీమ్ రావ్ భారత్ పార్టీ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు.టెండర్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని,నిబంధనలను ఉల్లంఘించిన అధికారుల పాత్రపై విచారణ జరిపించాలని,ఇప్పటికే డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్,తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు.ప్రజా సమస్యలపై జేబీపీ పోరాటం ఇక్కడితో ఆగదని యెర్రా కామేష్ తెలిపారు.కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు, ప్రజా నిధుల దుర్వినియోగంపై పార్టీ నిరంతరం నిఘా ఉంచుతుందని అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని యెర్రా కామేష్ స్పష్టం చేశారు,డీపీఆర్ టెండర్ రద్దు ప్రజా పోరాటానికి వచ్చిన ప్రాథమిక విజయమేనని,అయితే అసలు బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు.ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,పాల్వంచ,కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు నిట్టా నర్సింహ,శంకర్ తదితరులు పాల్గొన్నారు

## జువ్వాడి సహకారం తో నూతన త్రాగు నీటి బోరు ప్రారంభం



**మల్లాపూర్, ఆగస్టు13,(నవగీతం)** మల్లాపూర్ మండల కేంద్రం లోని ఒడ్డెర కాలనీ లో డిపెప్ పాఠశాల లో తాగునీటి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ అధ్యక్షులు జువ్వాడి నర్సింగ రావు సహకారం తో గ్రామ పంచాయతీ పాలకవర్గం నూతన తాగునీటి బోరును ప్రారంభించింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మరియు పాలకవర్గం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల లో నీటి ఇబ్బందులు తొలగిపోతాయని, విద్యార్థులకు,ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందుతుందని,వేసవి కాలంలో తలెత్తే త్రాగునీటి ఎద్దడిని ముందస్తుగా నివారించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,అరికుప్పల రాజం,ముత్యాల గంగా రాజం,శనిగారపు లావణ్య -నరేష్, ఏనుగు వెంకట్ రెడ్డి, వడ్డెర కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## మండల సోషల్ మీడియా ఇంచార్జీల నియామకం



**మల్లాపూర్, ఆగస్టు13,(నవగీతం)** మల్లాపూర్ మండల కేంద్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సోషల్ మీడియా కి సంబంధించినమండల కన్వీనర్లు గా రాఘవపేట్ గ్రామానికి చెందిన నత్తిరామ్, వేంపల్లి గ్రామానికి చెందిన పోతు శేఖర్ నియామకం అయ్యారు.అలాగే అన్ని గ్రామాల ఇన్చార్జీలను ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పూండ్ర శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షులు మాట్ల సోమయ్య,వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లాల జలపతి రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది అని ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని హామీ ఇచ్చారు.

## బోధన శైలిని మెరుగుపరచుకోవాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.రమేష్ బాబు



**జగిత్యాల, ఆగస్టు13,(నవగీతం):** జగిత్యాల జిల్లా నూతన ఇంటర్మీడియట్ విద్యా అధికారిగా వై. రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ -711 ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాట్లాడుతూ నూతన సిలబస్ కు అనుగుణంగా డిజిటల్ క్లాస్ రూములు ఉపయోగించుకొని ప్రతి లెక్చరర్ తమ బోధన శైలిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి ఉచిత పుస్తకాలు, ఉచిత నోట్ బుక్స్, యూనిఫామ్, టై, బెల్టు, షూస్ వంటివి ప్రతి విద్యార్థికి అందేలా చొరవ తీసుకోవాలని, మెరుగైన ఫలితాలను సాధించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. నర్సయ్య,డా.పి.తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజేష్, రాష్ట్ర కార్యదర్శి విజేందర్ కోశాధికారి సిహెచ్. నరసయ్య,తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరాచక పాలన

-మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 1న చిప్పగిరి మండలంలోని సంగాల గ్రామంలో వైయస్‌ఆర్‌సీపీ కార్యకర్త గిరిపై, ఆయన ఇంటిపై దాడి జరిగింది. సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎమ్మెల్యేకు గిరి రాత్రి 7.45 గంటలకు ఫోన్ చేసి, తనపై దాడి జరుగుతోందని, తన ఇంటి ఫొటోలు, వీడియోలు కూడా పంపించి రక్షించాలని కోరాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 7.47 గంటలకు చిప్పగిరి ఎస్ఐకి ఫోన్ చేసి సంఘాల వెళ్లి గిరిని కాపాడాలని కోరారు. అనంతరం సీఐకి ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఉదయం 8.03 గంటలకు మరోసారి సీఐకి సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లలేదని తెలిపారు. పోలీసులు స్పందించకపోవడంతో గిరిని కాపాడేందుకు ఎమ్మెల్యే స్వయంగా సంఘాల గ్రామానికి వెళ్లారు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గిరిని తన కారులో ఎక్కించుకుని చిప్పగిరికి తీసుకువస్తుండగా నేమకల్లు వద్ద ఎమ్మెల్యేపైనే దాడి జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు గాయపడి చేయి విరిగిందని పేర్కొన్నారు. బాధిత కార్యకర్తను కాపాడేందుకు వెళ్లడాన్నే ఎమ్మెల్యేపై పెట్టిన మొదటి కేసుగా మార్చారని అన్నారు. నేమకల్లు ఘటనను కప్పిపుచ్చేందుకు టీడీపీ కార్యకర్త తన భార్య దుస్తులను తానే చింపి, ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు చింపారంటూ ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారని వైయస్‌ఆర్‌సీపీ నాయకుడు ఆరోపించారు. ఇది ఎమ్మెల్యేపై పెట్టిన రెండో కేసు అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కారును ధ్వంసం చేశారంటూ మూడో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఎమ్మెల్యే తమ్ముడు శ్రీరాములు, దాడికి గురైన గిరిని తీసుకుని ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేయాలని కోరినా పోలీసులు కనీసం ఫిర్యాదును కూడా తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి వెళ్లినా బాధితుల ఫిర్యాదు స్వీకరించకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇది నాలుగో తప్పిదమని పేర్కొన్నారు. ఫిర్యాదు తీసుకోకపోవడమే కాకుండా బాధితులైన విరూపాక్ష, ఆయన కుటుంబ సభ్యులు, వైయస్‌ఆర్‌సీపీ కార్యకర్తలపైనే రివర్స్ కేసులు పెట్టారని తెలిపారు. సంఘాల ఘటనకు సంబంధించిన ఫిర్యాదులోనే పలువురి పేర్లు వేర్వేరు నిందితుల జాబితాల్లో మళ్లీ మళ్లీ పునరావతం కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విచారణ లేకుండానే కేసుల్లో పేర్లు చేర్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇది ఐదో తప్పిదమని తెలిపారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026




# బాక్సాఫీస్ వద్ద బిగ్ ఫైట్

**ఇండిపెండెన్స్ డే కానుకగా ఒకే రోజు థియేటర్లలోకి ఏడు చిత్రాలు!**

ఇండిపెండెన్స్ డే లాంగ్ వీకెండ్ సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునేందుకు టాలీవుడ్‌లో ఎన్నడూ లేని విధంగా భారీ పోటీ నెలకొంది. బాక్సాఫీస్ రేసులో నిలిచేందుకు పెద్ద సినిమాల నుంచి చిన్న చిత్రాల వరకు ఏకంగా 7 సినిమాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకే తేదీని టార్గెట్ చేస్తూ ఇన్ని సినిమాలు బరిలోకి దిగుతుండటంతో థియేటర్ల కేటాయింపు, అడ్వాన్స్ బుకింగ్స్ మరియు కలెక్షన్ల పరంగా తీవ్రమైన పోటీ తలెత్తింది. ఇక ఇందులో తెలుగులోనే 5 సినిమాలు రాబోతుండగా హిందీ నుంచి రెండు సినిమాలు విడుదల కాబోతున్నాయి.

**విశ్వనాథ్ అండ్ సన్స్ :** తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం విశ్వనాథ్ అండ్ సన్స్. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మమిత బైజు కథనాయికగా నటిస్తుండగా రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ చిత్రంపై అటు తమిళంతో పాటు ఇటు తెలుగులో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే కరుప్పు సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న సూర్య ఈ సినిమాతో మరో హిట్టు కొడతాడని అభిమానులు అంచనాలు వేస్తున్నారు.

**అగధ :** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రాబోతున్న చిత్రం ఇది. మిస్టిక్ హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ అంటూ రాబోతున్న ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ సినిమాపై కూడా టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**మకుటం :** కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ తొలిసారిగా మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'మకుటం'. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై 99వ ప్రాజెక్ట్‌గా ఇది వస్తోంది. ఇందులో విశాల్ భిన్నమైన మూడు పాత్రల్లో విశ్వరూపం చూపించనున్నారు. విశాల్, అంజలి కాంబినేషన్‌కు ఉండే క్రేజ్ ఈ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

**పల్లాబురుసు :** గ్రామీణ తెలంగాణ నేపథ్యంలో సాగే ఒక సరికొత్త ఫ్యామిలీ కామెడీ–డ్రామా చిత్రం ఇది. సాధారణమైన ఒక వృద్ధ తండ్రి తన కొడుకుపై పోలీస్ స్టేషన్‌లో చిన్న కారణం (టూత్‌బ్రష్ కొనివ్వలేదని) నిమిత్తం కంప్లైంట్ ఇవ్వడం వంటి విభిన్నమైన పాయింట్‌తో ఈ కథ నడుస్తుంది. తండ్రీకొడుకుల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాలు, అహం, మారుతున్న సామాజిక విలువలను కళ్లకు కట్టేలా ఈ చిత్రాన్ని దర్శకుడు ఎమోషనల్ అండ్ ఎంటర్‌టైనింగ్ వేలో తెరకెక్కించారు. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ ఉ ఎపిక్ స్టూడియోస్ నిర్మించాయి.

హుషార్ పిట్టలు : వాసవి గణేషన్, అన్ష్, సునితా మనోహర్, అంజి వల్లుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు భిక్షు దర్శకత్వం వహించాడు. పూర్తిగా యూత్‌ఫుల్, లవ్ మరియు ఫ్రెండ్‌షిప్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో రూపొందిన చిత్రం ఇది. నేటి యువత ఆలోచనలు, వారి జీవితంలోని సరదా క్షణాలు, ప్రేమ మరియు అనుబంధాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. బాక్సాఫీస్ వద్ద కాలేజ్ గోయర్స్ మరియు యూత్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఈ సినిమా రూపొందింది.

**ఆవారాపన్ 2 :** ఇమ్రాన్ హష్మీ, దిశా పటాని, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంచలన విజయం సాధించిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న క్రేజీ యాక్షన్ ఎమోషనల్ డ్రామా ఇది. 'శివమ్' పాత్ర మరోసారి క్రైమ్ ప్రపంచంలోకి అడుగుపెట్టి, ప్రేమ, ప్రతీకారం, త్యాగం మరియు విముక్తి కోసం సాగించే అన్?షణ దీని ప్రధాన కథాంశం.






# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను

'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబెట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి. ఇది కేవలం హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. డివైన్ మూమెంట్స్ కూడా ఇందులో బలంగా ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపింది కామాక్షి భాస్కర్ల.

# యువతలో మార్పు తెస్తుంది



అన్ష్, వాసవి గణేషన్ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రుద్రకాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది ప్రీమియర్‌షోస్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తున్నది. వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలున్న కథ ఇది. చరణ్ అర్జున్ మ్యూజిక్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. నేటి యువతకు చక్కటి సందేశాన్ని అందించే చిత్రమిదని, హిట్ పక్కా అని హీరో అన్ష్ నమ్మకం వ్యక్తం చేశారు. ఒక జనరేషన్‌లో మార్పుతెచ్చే సినిమా ఇదని కథానాయిక వాసని గణేషన్ చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: రుద్రసాయి, సంగీతం: చరణ్‌అర్జున్, దర్శకత్వం: బిక్షు.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా



వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది. నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది. ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్ళుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.